
పెద్దకర్మ
స్వస్తిశ్రీ శోభకృత్ నామ సం॥ర మార్గశిర బ॥ త్రయోదశి
తేది. 09-01-2024 మంగళవారం రోజున
మా తండ్రి గారైన
శ్రీ రామ శ్రీనివాస్ గారు
శివైక్యం పొందినారని తెలుపుటకు చింతించుచున్నాము.
తేది. 21-01-2024 ఆదివారం రోజున ఉదయం 9-00 గం॥లకు
పెద్దకర్మ, పుణ్యాహవాచనం, పిండప్రదానం, ఆశీర్వచనము
జరుపబడును. కావున మీరందరు వచ్చి మా తండ్రి గారి
ఆత్మకు శాంతి చేకూర్చగలరని కోరుచున్నాము.
ఇట్లు
కుమారుడు : రామ శైలేష్
భార్య : రామ శోభారాణి
కూతురు-అల్లుడు : నిమ్మగడ్డ స్వాతి-మహేష్
కార్యస్థలము : సిల్వర్ క్రౌన్ హైస్కూల్, బెస్తం చెరువు, తిమ్మపూర్ హవేలి, వరంగల్ - ఖమ్మం హైవే, వరంగల్.
సహపంక్తి భోజనము: మధ్యాహ్నం 1-00 గంటలకు.



# వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 182 శుక్రవారం | 19 జనవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



8లో..

## ఆయిల్ ట్యాంకర్ బస్సు ఢీ

25 మందికి గాయాలు



## బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా గంటా రవి

ప్రకటించిన రాష్ట్ర కమిటీ

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మార్పులు

8 లో..


2లో

## సమన్వయంతో పనిచేద్దాం..

రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

- ఆమె వస్తే పార్టీకి నష్టమే
- పదవి కాపాడుకునేందుకే ఎత్తుగడలు
- ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్న పార్టీ శ్రేణులు
- జిల్లా మంత్రికి తెలుపకుండా చేర్చుకునేది లేదంటున్న అధిష్ఠానం



# క్యాడర్ లేని లీడర్ .. మనకొద్దు

వివరాలు 2లో..

**సుధారాణికి కాంగ్రెస్‌లో మూసుకున్న ద్వారాలు**



క్యాడర్ లేని లీడర్ గుండు సుధారాణి మనకొద్దు అంటూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు. ఆమె పదవులకోసం పాకులాడుతారు తప్ప పార్టీకి కానీ, ప్రజలకు కాని ఎలాంటి ప్రయోజనం ఉండదంటున్నారు. కరెప్షన్ లోనూ అమె అందెవేసిన చేయి అంటూ విమర్శిస్తున్నారు. ఇలాంటి నేతను కాంగ్రెస్‌లో చేర్చుకుంటే పార్టీకి చెడ్డ పేరు వస్తుందంటున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం కొంతమంది కాంగ్రెస్ నేతలు జిల్లా మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ దృష్టికి తీసుకుపోగా వారు సైతం సుధారాణి రాకను వ్యతిరేకించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా జిల్లా మంత్రికి తెలియకుండా, వారి అనుమతి లేకుండా పార్టీలో ఎవరినీ చేర్చుకునేది లేదంటూ అధిష్ఠానం సైతం స్పష్టం చేసినట్లు తెలిసింది. అయినప్పటికీ పట్టు వదలని విక్రమార్కుడిలా గుండు సుధారాణి పాత టీడీపీ నేతలతో పైరవీలు కొనసాగిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

- వరంగల్ వాయిస్, వరంగల్

# క్యాడర్ లేని లీడర్..
# మనకొద్దు



**సుధారాణికి కాంగ్రెస్ లో మూసుకున్న ద్వారాలు**

**ఆమె వస్తే పార్టీకి నష్టమే**

**పదవి కాపాడుకునేందుకే ఎత్తుగడలు**

**ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్న పార్టీ శ్రేణులు**

**జిల్లా మంత్రికి తెలుపకుండా చేర్చుకునేది లేదంటున్న అధిష్ఠానం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహా నగర పాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్న వార్తలు గత కొద్ది రోజులుగా వైరల్ గా మారాయి. గత తెలుగు దేశం పార్టీ నేతలతో కలిసి ఆమె పావులు కదుపుతున్నట్లు ప్రచారం సాగుతోంది.



ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డితో చర్చలు సఫలమైనట్లు, ఈ నెల 20న కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రచారం జోరందుకుంది. ఇదిలా ఉండగా ఆమెను పార్టీలో చేర్చుకోవడాన్ని ఆ పార్టీ శ్రేణులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు. పచ్చగా ఉన్న ప్రాంతంలోనే పది పైసలు సంపాదించుకోవచ్చన్న లక్ష్యంతోనే ఆమె పార్టీ మార్పును తెరపైకి తెచ్చినట్లు కాంగ్రెస్ శ్రేణులు ఆరోపిస్తున్నారు. క్యాడర్ లేని కరెప్షన్ మేయర్ ను పార్టీలోకి చేర్చుకుంటే చెడ్డ పేరు వస్తుందంటూ హెచ్చరిస్తున్నారు. ఆమెను చేర్చుకోవడం ద్వారా ఆమె లాభపడుతుంది తప్ప ప్రజలకు కాని, పార్టీకి కాని ఎలాంటి ప్రయోజనం ఉండదంటున్నారు.

## మూసుకున్న ద్వారాలు..

గుండు సుధారాణి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టినట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సైతం ఆమె అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించినట్లు సమాచారం. ఈ విషయంలో సీఎం అంతరంగికుడు వేం నరేందర్ రెడ్డి పార్టీ నేతలకు క్లారిటీ ఇచ్చినట్లు సమాచారం. పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు..ఇతర పార్టీలనుంచి వచ్చిన వారిని చేర్చుకోమంటూ సీఎం రేవంత్ రెడ్డి ఇదివరకే ప్రకటించారు. ఇదే విషయాన్ని వేం నరేందర్ రెడ్డి సైతం ధృవీకరించినట్లు తెలుస్తోంది. దీంతో సుధారాణి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ద్వారాలు మూసుకున్నట్లు తెలియవచ్చింది. అయినప్పటికీ టీడీపీ నేతలతో సుధారాణికి ఉన్న సాన్నిహిత్యంతో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఆమె పావులు కదుపుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

## పదవికోసం ఎత్తుగడలు..

ఏ ఎండకు ఆ గొడుగు పట్టినట్లు గుండు సుధారాణికి అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీలోకి మారి పదవులు అనుభవించడం కొత్తేమీ కాదంటూ కాంగ్రెస్ శ్రేణులు విమర్శిస్తున్నారు. మేయర్ పదవిని కాపాడుకునేందుకే రాష్ట్రంలో కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఎత్తుగడలు వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తెలుగు దేశం పార్టీ నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆమె ఆ పార్టీలో రాజ్యసభ సభ్యురాలిగా, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా పదవులను వెలగబెట్టారంటున్నారు. టీడీపీకి తెలంగాణలో కాలం చెల్లిందని గ్రహించిన సుధారాణి తెలివిగా ఉద్యమ పార్టీ అయిన టీఆర్ ఎస్ లో చేరి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా, మహిళా ఆర్థిక సహకార సంఘం రాష్ట్ర చైర్మన్ గా పదవులు పొందారంటున్నారు. ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో ఆమె నగర ప్రజలకు చేసిందేమీ లేదంటున్నారు. తన స్వప్రయోజనాలు తప్ప సుధారాణి వేరే ఆలోచనే ఉండదంటూ విమర్శిస్తున్నారు.

## టీడీపీ నేతలతో మంతనాలు..

రాష్ట్రంలో బీఆర్ ఎస్ శకం ముగిసిందని భావిస్తున్న గుండు సుధారాణి ఆ పార్టీకి రాం..రాం పాడి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధపడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. తనకు టచ్ లో ఉన్న పూర్వ టీడీపీ నేతలకు ఫోన్ చేయడంతో పాటు వారిని నేరుగా కలుసుకొని తనకు సహకరించాల్సిందిగా అభ్యర్థిస్తున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం టీడీపీ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చిన వ్యక్తే కావడంతో తన ప్రయత్నం సాఫీగా జరుగుతుందని సుధారాణి భావిస్తున్నట్లు తెలిసింది.

## వ్యతిరేకిస్తున్న కొండా మురళి..

మేయర్ గుండు సుధారాణి కాంగ్రెస్ పార్టీలో చేరుతారంటూ వస్తున్న ప్రచారాన్ని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఎట్టి పరిస్థితిలో ఆమెను పార్టీలోకి చేర్చుకునేది లేదంటూ ఖరాఖండిగా చెప్పారు. ఎన్నికల సమయంలో పార్టీ కోసం పనిచేసిన వారికే పార్టీలో పెద్ద పీట వేస్తామన్నారు. పదవుల కోసం పాకులాడే వారిని కాంగ్రెస్ లోకి చేర్చుకోబోమన్నారు. జిల్లా మంత్రికి తెలుపకుండా, వారి ఆమోదం లేకుండా కొత్త వారిని ఎవరినీ కూడా పార్టీలో చేర్చుకునేది లేదంటున్న అధిష్ఠానం స్పష్టం చేసినట్లు చెప్పుకొంటున్నారు. ఇప్పుడు బీఆర్ ఎస్ లో సుధారాణి మాటను నమ్మేవారు లేరని, పార్టీ పెద్దలు సైతం ఆమె వ్యవహార శైలిని ఎండగడుతున్నట్లు సమారాచం. దీంతో సుధారాణి రెండుకు చెడ్డ రేవడిగా మారిందన్న ప్రచారం సాగుతోంది.

# సమన్వయంతో పనిచేద్దాం..

**రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం**

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**వరంగల్ వాయిస్, క్రైం :** ప్రభుత్వ విభాగాల సమన్వయంతో పాటు ప్రజల సహకారంతో రోడ్డు ప్రమాదాల నివారణకు పనిచేద్దామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులకు సూచించారు. ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 14వరకు నిర్వహించనున్న జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని సీపీ అధ్యక్షతన వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర రోడ్డు రవాణా విభాగం, పోలీసు అధికారులు, స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్, బులియన్ మర్కెట్, ఇతర వ్యాపార సముదాయాలకు చెందిన కార్యవర్గ సభ్యులు పాల్గోన్న ఈ సమావేశంలో సీపీ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా గంటకు యాబ్కెకి పైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటే ఇందులో 19మంది మరణిస్తున్నారన్నారు. రోజు రోజుకి వాహనాల సంఖ్య ఘననీయంగా పెరుగడంతో అదే స్థాయిలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రమాదాల్లో మరణించిన వ్యక్తుల కుటుంబాలు రోడ్డున పడటంతో పాటు వారి కుటుంబ సభ్యుల జీవితాలు చిద్రమవుతున్నాయన్నారు. అయితే రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వ విభాగాలతో పాటు ప్రజలు సైతం భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకోసం ముందుస్తూ ప్రణాళిక రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హై స్పీడ్ వాహనాల వినియోగంలో వాహనదారులతో పాటు వారి కుటుంబ సభ్యులకు రోడ్డు ప్రమాదాలపై అవగాన కల్పించాలని, అలాగే అతి వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించడం లాంటి చర్యలకు వాహనదారులు పాల్పడకుండా కళాశాల విద్యార్థులతో పాటు, ప్రజలకు అవగాహన తరగతులను నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ, స్టేట్ ప్రధాన రోడ్డు మార్గాలను కలిపే రోడ్లకు అనుసంధానమైన గ్రామాల్లో రోడ్డు సేఫ్టీ కమీటీలను ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించడం ద్వారా మరణాల శాతాన్ని తగ్గించగలమన్నారు. ప్యాసింజర్ వాహనాలదారుల్లో మార్పు వచ్చే సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్ సెఫ్టీ విభాగానికి చెందిన ఇన్స్‌స్పెక్టర్ రవి రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలపై రవాణా శాఖ రూపోందించిన వాల్ పోస్టర్లు, కరప్రతాలను పోలీస్ కమిషనర్ అవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ అఫీసర్ పురుషోత్తం, ఆర్టీఓ రంగారావు, ఏసీపీలు జితేందర్ రెడ్డి, రమేష్‌కుమార్, ట్రాఫిక్ ఇన్స్‌స్పెక్టర్లు వెంకన్న, సీతారెడ్డి, సుజాత, ఎంవీఐలు రమేష్ రాథోడ్, రవీందర్, స్వర్ణలత, షాలిని, ఫహిమా, శ్రీనివాస్, ఛాంబర్ ఆఫ్ కామర్స్, బిలియన్ మార్కెట్ అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి, శ్రీనివాస్‌తో పాటు ఇతర వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# శానిటేషన్ విధానాలపై అధ్యయనం

**మేయర్ సుధారాణితో జపాన్ బృందం భేటీ**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహా నగరంలో అమలు చేస్తున్న శానిటేషన్ విధానాలను అధ్యయనం చేయడానికి జపాన్ కు చెందిన ద్వి సభ్య బృందం శుక్రవారం నగరంలో పర్యటించింది. కార్యక్రమంలో భాగంగా బల్దియా ప్రధాన కార్యాలయంలో నగర మేయర్ గుండు సుధారాణిని బృంద సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మేయర్ గుండు సుధారాణి గ్రేటర్ వరంగల్ లో అమలు చేస్తున్న అత్యాధునిక శానిటేషన్ పద్దతులను తెలియజేశారు. ఆసియన్ డెవలప్ మెంట్ బ్యాంక్ (ఏడీబీ) వారు అందజేసిన అసైన్ మెంట్ ను అధ్యయనం చేయడంలో భాగంగా జపాన్ శానిటేషన్ కౌన్సిల్ అసోసియేషన్ కు చెందిన ఇద్దరు సభ్యుల బృందం నగరంలో పర్యటించారు. ఇందులో భాగంగా జీడబ్ల్యుఎంసీ నిర్వహిస్తున్న మల శుద్ధి నిర్వహణ (ఎఫ్ ఎస్ టీపీ) ల అధ్యయనంలో భాగంగా అమ్మవారి పేటలోని కేంద్రాన్ని సందర్శించి ప్లాంట్ ట్రీట్మెంట్ ల సామర్థ్యం ఎంత? నిర్వహణ చేసేవారు, విధి విధానాలను అడిగి తెలుసుకున్నారు. 14420 టోల్ ఫ్రీ నంబర్ గురించి నగరవాసుల్లో చైతన్యం కల్పించి ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సెప్టిక్ ట్యాంక్ లను క్లీనింగ్ చేయిస్తున్నట్లు మేయర్ తెలిపారు. పర్యటనలో భాగంగా జపాన్ బృందం అమ్మవారిపేటలో మల శుద్దీకరణ కేంద్రంతో పాటు ఎంజీఎంలో నిర్వహిస్తున్న ఎస్ టీపీ కేంద్రాన్ని పరిశీలించింది. అనంతరం జపాన్ బృంద సభ్యులను మేయర్ శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ కో–ఆపరేషన్, ప్రాజెక్ట్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ కత్సుయోషి సుడో, ఇంటర్నేషనల్ ఎఫైర్స్ మేనేజర్ డాక్టర్ పైర్రే ఫ్లేమండ్ తో పాటు అస్కి ప్రతినిధి డాక్టర్ రాజ్ మోహన్ రెడ్డి, సభ్యులు అవినాష్ పాల్గొన్నారు.

# రైతుల రుణమాఫీ హామీని అమలు చేయాలి

## బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రాష్ట్రంలోని రైతులందరికీ రెండు లక్షల రూపాయల రుణమాఫీ అమలు చేసేందుకు తగిన చర్యలు వెంటనే చేపట్టాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మాది రైతు ప్రభుత్వమని ప్రచార ఆర్భాటం గొప్పగా చేసిందని ఆచరణలో రైతు సమస్యలపరిష్కారంలో, రైతు ఆత్మహత్యల నివారణలో ఘోరంగా విఫలమైందన్నారు . రైతు రుణమాఫీ అమలు విషయంలో తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని, విడతల వారీగా అంటూ కాలయాపన చేసినందున వడ్డీలు పెరిగి తడిసి మోపెడయ్యాయని ఫలితంగా రైతులు అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. రైతు బంధు పేరుతో వందలాది ఎకరాలు ఉన్న భూస్వాములకు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని పంపిణీ చేసిందే తప్ప నిజమైన రైతుల బాధలు పట్టించుకోక పోవడం వల్లనే వారి ఆగ్రహానికి ఆ ప్రభుత్వం బలైపోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో రైతు రుణమాఫీపై ఇచ్చిన హామీపై రైతులు ఎంతో నమ్మకంతో ఉన్నారని, వారికి ఎంత ఎక్కువ రుణం ఉన్నా అందులో రెండు లక్షల రూపాయలు రుణ మాఫీ చేసి రైతు ప్రయోజనాలను కాపాడాలని, రాష్ట్రంలో రైతు కూలీల సంక్షేమానికి, వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ కాపీ అందజేత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 6వ డివిజన్ బొక్కలగడ్డకు చెందిన అబ్దుల్ ఖాదిర్ మొహమ్మద్ అనారోగ్యంతో నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స నిమిత్తం చేరారు. హాస్పిటల్ వైద్యులు అతని వైద్య ఖర్చులకు రూ. 5లక్షల ఖర్చు అవుతాయని చెప్పడంతో బాధితులు స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కలిసి తమ సమస్యను విన్నవించగా వెంటనే వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ స్పందించి రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్ ) కింద రూ.2లక్షల 50వేలు వైద్య ఖర్చుల కోసం మంజూరు చేయగా శుక్రవారం కుటుంబ సభ్యులు కూతురు అయేషా సిద్ధఖికి నాయిని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ డిపార్టుమెంటు చైర్మన్ బొమ్మతి విక్రం, డివిజన్ అధ్యక్షుడు అగార్ధిది శివాజీ, వరంగల్ వెస్ట్ సోషల్ మీడియా కార్యదర్శి బొమ్మతి రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

# కస్టమర్లకు కార్గో కష్టాలు

## పట్టించుకోని ఆర్టీసీ అధికారులు




**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ లో ఏర్పాటుచేసిన కార్గో వల్ల కస్టమర్లకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దాదాపు వారం పది రోజుల నుంచి కార్గో ద్వారా ములుగు నుంచి వేరే గ్రామాలకు వస్తువులు పంపించాలంటే కార్గో ద్వారా పంపించాలి. కానీ, వారం రోజుల నుంచి కార్గో నెట్ వర్క్ పని చేయకపోవడం వల్ల కస్టమర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ యజమాన్యం పట్టించుకోకపోవడం వల్ల కార్గో యజమాని నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అందువల్ల కస్టమర్లకు ఇబ్బందులు కలుగుతున్నాయని, దీనిపై వెంటనే ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కస్టమర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# స్వచ్ఛంద సంస్థలకు ఆదర్శం బాలవికాస

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**వరంగల్ వాయిస్, కాజీపేట :** బాల వికాస వినూత్న ఒరవడితో నిర్మితమైన అనేక పథకాలు ప్రభుత్వాలకు పలు శిక్షణ కార్యక్రమాల ద్వారా సమర్థ నాయకులుగా తీర్చిదిద్దిన బాల వికాస మూఢ నమ్మకాలను ప్రారదోలడంలో ముందున్న బాల వికాస ఆదర్శనమని వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఫాతిమానగర్ లోని పీడీటీసీ ట్రైనింగ్ సెంటర్లో సమర్థ సుస్థిరాభివృద్ధి అనే అంశం పేరిట ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ వినూత్న కార్యక్రమం చేపట్టిన అది బాలవికాస నుంచే ప్రారంభమవుతుందన్నారు. మహిళా పథకమైన, చెరువు పూడికతీత పనైనా, అనాథ పిల్లలు, వాటర్ ప్లాంట్లు, మరుగుదొడ్ల నిర్మాణం లాంటి మరెన్నో ఉన్నాయని అన్నారు. బాలవికాస వినూత్న ఒరవడితో, ప్రజల భాగస్వామ్యంతో, పరిస్థితులకు అనుగుణంగా, స్థానిక వనరులను వినియోగించుకొని పథకాలను రూపొందించి ఎన్నో సమస్యలను పరిష్కరిస్తూ అంతమందికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. వివిధ శిక్షణాల ద్వారా సామాన్య ప్రజలను ఉత్తేజపరిచి గొప్ప నాయకులుగా తయారు చేసే సంస్థ బాల వికాస అన్నారు. వితంతు విముక్తి ఉద్యమం ద్వారా మూఢ నమ్మకాలను ప్రారదోలడంలో బాల వికాస చేస్తున్న కృషి అభినందనీయమని, భవిష్యత్తులో వినూత్నమైన ఆలోచనలతో మరిన్ని పథకాలకు రూపకల్పన చేయాలని ప్రభుత్వం తరపున అన్ని రకాల సహాయ సహాకారాలు అందిస్తానని తెలిపారు. 47ఏళ్ల నుంచి ఇలాంటి ప్రజా ఉపయోగ కార్యక్రమాలు చేపడుతున్న సంస్థ వ్యవస్థాపకురాలు బాల థెరిస్సా సేవలు అభినందనీయమని అన్నారు. ఈ టీపీసీసీ ఎస్సీ పార్టుమెంటు కో-ఆర్డి నేటర్ ఎం.పి ఆనంద్ కార్యక్రమంలో ఇండియన్ ఇన్సిట్యూట్ అఫ్ కేమికాల్ టెక్నాలజీ చీఫ్ ఇంజినీర్ డాక్టర్ శ్రీధర్, రాష్ట్ర పునరుద్ధరణ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ వరంగల్ మేనేజర్ మహేందర్ రెడ్డి, బాల వికాస సంస్థ ఎగ్జి క్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరి రెడ్డి, బలవికాస ఫెడరేషన్ డైరెక్టర్ కేడం లింగమూర్తి, సోపార్ కెనడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శోభ, బాల వికాస అధ్యక్షులు నోముల ఇంద్రా రెడ్డి, ఉపాధ్యక్షులు బాసని మర్రెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# 11వ సారి ఫొటోగ్రాఫర్ పునేష్ రక్తదానం



**వరంగల్ వాయిస్, ఖానాపురం :** రాగంపేట గ్రామానికి చెందిన బ్లడ్ డోనర్, బ్లడ్ మోటివేటర్ వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు ) స్ఫూర్తితో కేర్ హాస్పిటల్ నాంపల్లి హైదరాబాద్ లో సత్యనారాయణకు ఓపెన్ హార్ట్ సర్జరీ కోసం అత్యవసరంగా అత్యంత అరుదుగా దొరికే ఓ నెగిటివ్ రక్తం అవసరం ఉండగా బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు)ను నర్సంపేట ప్రాంతానికి చెందిన వారి బంధువు గోపి సంప్రదించగా , వెంటనే స్పందించిన బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు ), హైదరాబాదులో జీవనోపాధి కోసం వెళ్లిన రాగంపేట గ్రామానికి చెందిన పంతంగి పునేష్ యస్.యస్.డీ.పీ ఫొటోగ్రాఫర్ )కు సమాచారం ఇవ్వడం జరిగింది.వెంటనే స్పందించిన ఫొటోగ్రాఫర్ పంతంగి పునేష్ స్వచ్ఛందంగా 11వ సారీ ఓ నెగిటివ్ రక్తాన్ని కేర్ హాస్పిటల్ నాంపల్లి హైదరాబాద్ లో రక్తదానం చేశారు. 11వ సారీ రక్తదానం చేసిన పునేష్ ను రాగంపేట గ్రామ సర్పంచ్ భాషబోయిన ఐలయ్య, రాగంపేట గ్రామ ప్రజలు, యువత నాగరాజ్, మహేష్, చిరంజీవి, అనిల్, రాజశేఖర్, భానుప్రకాష్, సూరయ్య, శ్రీను, బ్లడ్ డోనర్, బ్లడ్ మోటివేటర్ వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు) అభినందించారు.

# కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండలంలోని ఆలేరు గ్రామంలో రెండవ వార్డులోజడ్పీహెచ్ఎస్ హైస్కూల్ వెనకాల గల బొడ్రాయి కేంద్రం నుంచి కార్పెంటర్ జనగం సారంగపాణి ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగింది. కానీ, ఈ నిర్మాణం విషయంలో నాణ్యత ప్రమాణాలను పాటించకుండా నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణంలో ఒక ప్రాంతంలో 12ఫీట్లు, మరొక ప్రాంతంలో 10ఫీట్ల, మరొక ప్రాంతంలో 14 ఫీట్లకు మించి రోడ్డును పోయించారు. ఒక ప్రాంతంలో ఒంపుగా మరొక ప్రాంతంలో మెట్టగా పోయడం వల్ల అక్కడక్కడ నీరు నిలుస్తుంది, ఒక ప్రాంతంలో మందంగా ఒక ప్రాంతంలో పలుచగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ విషయం పై నెల్లికుదురు మండలం నేనాల గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ రమేష్ ను నిలదీస్తే నాకు నచ్చిన విధంగా రోడ్డు నిర్మిస్తా మీకు చేతనైంది చేసుకోండని, మీరు ఎవరికీ ఫిర్యాదు చేసుకుంటారో చేసుకోండి అంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఇలాంటి నాణ్యత లోపంతో నిర్మించిన రోడ్డుకు సంబంధించిన బిల్లును వెంటనే రద్దు చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

# 21న సీపీఐ వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ సమావేశం

## పాల్గొననున్న ఎమ్మెల్యే కూనంనేని, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రానున్న పార్లమెంటు ఎన్నికలలో పోటీ చేసేందుకు సీపీఐ సన్నద్ధమవుతున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఏర్పడిన ఇండియా కూటమిలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఒక స్థానాన్ని సీపీఐ కోరుతున్నదని, అందులో వరంగల్ పార్లమెంటు స్థానాన్ని తాము కోరుతున్నామని తెలిపారు. ఈ క్రమంలో వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఈ నెల 21న ఉదయం 11గంటలకు హనుమకొండలోని హరిత హెూటల్ లో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గడిచిన పదేళ్లుగా అధికారంలో ఉండి కార్పొరేట్, పెట్టుబడి దారీ వర్గాలకు మేలు చేసిందే తప్ప పేదలకు, మధ్యతరగతి వర్గాలను పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఉద్యోగాల కల్పనలో విఫలం చెందిందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసి ఉన్న ఉద్యోగులను రోడ్డున పడవేసిందని, రైతాంగాన్ని, వ్యవసాయ కూలీలను విస్మరించిన బీజేపీని పార్లమెంటు ఎన్నికలలో ఓడించాలని కోరారు. అలాగే గడిచిన తొమ్మిదిన్నర సంవత్సరాల కాలం అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, ప్రాజెక్టుల నిర్మాణంలో, సంక్షేమ పథకాల అమలులో భారీ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నదని అన్నారు. రాష్ట్రంలో నియంతృత్వ పోకడలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన బీఆర్ఎస్ ను పార్లమెంటు ఎన్నికలలో ఓడించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, కొట్టెపాకరవి, మాలోతు శంకర్, రాసమల్ల దీనా, రమేష్ పాల్గొన్నారు.

# హరిత ప్రాంగణంగా హనుమకొండ కలెక్టరేట్

## కలెక్టర్ సిక్తా పట్నాయక్



**వరంగల్ వాయిస్, హనుమకొండ** : వివిధ రకాల మొక్కలతో హరిత ప్రాంగణంగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్ రూపుద్దిద్దుకుంటుందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణం చుట్టూ వివిధ రకాల పూల మొక్కలతో పాటు, ఆకర్షణీయమైన మొక్కలను ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో నాటారు. ఈ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రాంగణంలో మొక్కను నాటి నీళ్లు పోశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణం చుట్టూ పదివేల మొక్కలను నాటి హరిత ప్రాంగణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే విధంగా వివిధ రకాల మొక్కలను నాటడం జరిగిందన్నారు. కలెక్టరేట్ ఆవరణ మొత్తం పచ్చదనంతో ప్రశాంత వాతావరణం ఉట్టిపడే విధంగా వేలాది మొక్కలను నాటినట్లు తెలిపారు. కలెక్టరేట్ లోని నాటిన మొక్కల సంరక్షణకు ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలు ఎప్పుడు పచ్చదనంతో కళకళలాడే విధంగా సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్ జీ, ట్రైనీ కలెక్టర్ శ్రద్దా శుక్లా, డీఆర్ఓ వై.వీ. గణేష్, డీఆర్డీఓ శ్రీనివాస్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ దండుపాళ్యం బ్యాచ్‌ను ప్రజలే రాళ్లతో కొడతారు

## టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



**వరంగల్ వాయిస్, వరంగల్** : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుంటే, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ మాత్రం ప్రజలు ఆరునెలల్లో ప్రభుత్వంపై తిరగబడతారని మాట్లాడటం ఆయన అహంకారానికి, అధికార దాహానికి నిదర్శనమని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ విమర్శించారు. పదేండ్లు అధికారంలో ఉండి కూడా ప్రజలను పట్టించుకోకుండా, ప్రజల చేతిలో చిత్తుగా ఓడిపోయిన బీఆర్ఎస్ నాయకులు అధికారం లేకపోయే సరికి మతిభ్రమించినట్లు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. రూ.17వేల కోట్ల మిగులు బడ్జెట్ తో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటుచేస్తే, రాబంధుల్లా రాష్ట్రాన్ని దోచుకున్నది బీఆర్ఎస్ నాయకుల దండుపాళ్యం బ్యాచ్ కాదా? అని బండి సుధాకర్ గౌడ్ కేటీఆర్ ను నిలదీశారు. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ నాయకులు ఇష్టారాజ్యంగా నిధులను కొల్లగొట్టి ఖజానాను ఖాళీ చేస్తే, వారి అవినీతి చిట్టాను ప్రజల ముందు ఉంచే పనిలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉందన్నారు. తమ అవినీతి భాగోతాలు ఎక్కడ బయటపడుతాయో అనే భయంతో ఈ ట్విట్టర్ పిట్ట కేటీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని తీవ్రంగా ఖండించారు. రానున్న రోజుల్లో ప్రజలు ఎవరిపై తిరగబడతారో ఈ పార్లమెంట్ ఎన్నికల్లోనే తేలిపోతుందన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6గ్యారంటీలతో పాటు, మరిన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించడానికి సీఎం రేవంత్ రెడ్డి ముందుకుపోతుంటే, ఓర్వలేని కేటీఆర్ అవాకులు, చెవాకులు పేలుతున్నారని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని మీ కుటుంబ స్వార్థ ప్రయోజనాల కోసం ఢిల్లీ వీధుల్లో తాకట్టుపెట్టిన మీరు.. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని మాట్లాడటం మీ రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. మీరు పదేండ్లలో సరైన పెట్టుబడులను తేలేకపోయారని, దావోస్ లో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దాదాపు 40వేల కోట్ల పెట్టుబడులను తెలంగాణకు తీసుకురావడానికి కృషి చేశారని, ఇది చూసి ఓర్వలేకనే కేటీఆర్ చౌకబారు ఆరోపణలు చేస్తున్నాడని అన్నారు. బీఆర్ఎస్ దండుపాళ్యం బ్యాచ్ చేసిన అవినీతి, అక్రమాలను, అరాచకాలను బయటపెట్టగానే ప్రజలు మిమ్ముల్ని రాళ్లతో కొట్టే రోజు దగ్గర్లోనే ఉన్నదని బండి సుధాకర్ గౌడ్ హెచ్చరించారు.

# మంత్రి పొన్నంను కలిసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



**వరంగల్ వాయిస్, శాయంపేట** : రాష్ట్ర బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను శుక్రవారం శాయంపేట కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మాజీ ఏఎంసీ చైర్మన్ పోలేపల్లి శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ చల్లా చక్రపాణి, మాజీ సర్పంచ్ దుబాసి కృష్ణమూర్తి, జిల్లా నాయకులు బాసని శంకర్, రవీందర్లు మర్యాదపూర్వంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# మేడారం జాతరలో ట్రైబల్ ఆర్ట్, హ్యాండ్లూమ్స్, హ్యాండీక్రాప్స్ సమ్మేళం

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, ములుగు** : మేడారం జాతరలో ట్రైబల్ ఆర్ట్, హ్యాండ్లూమ్స్, హ్యాండీక్రాఫ్స్ సమ్మేళం ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శుక్రవారం కేంద్ర పర్యాటక, సంస్కృతి అభివృద్ధి శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు టెక్స్ టైల్ మంత్రిత్వ శాఖ డెవలప్ మెంట్ డైరెక్టర్ అరుణ్ కుమార్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మేడారంలోని ట్రైబల్ మ్యూజియం, హరిత హోటల్ ను శుక్రవారం సందర్శించారు. మేడారంలో జరగబోయే శ్రీ సమ్మక్క సారమ్మ జాతరలో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రకాల ట్రైబల్ ఆర్ట్, హ్యాండ్లూమ్స్, హ్యాండీక్రాఫ్స్ సమ్మేళం చేసి వాటి ప్రదర్శన చేయడం జరుగుతుందని టెక్స్ టైల్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ అరుణ్ తెలిపారు. జాతర సమయంలో దేశవ్యాప్తంగా 20మంది ట్రైబల్ కళాకారులు సమ్మేళనాన్ని ఏర్పాటు చేసి వాటిని అమ్మకాలకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సెంట్రల్ టెక్స్ టైల్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో థీమ్ ఫెవిలియం ఏర్పాటు చేయడం జరుగుతుందని, దీనిలో దేశవ్యాప్తంగా ఉన్నటువంటి గిరిజన సాంప్రదాయ, సంస్కృతుల కళాఖండాలను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ మేడారం జాతరలో ఏర్పాటు చేయబోయే గిరిజన కళాకృత సమ్మేళనానికి అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గిరిజన కళాకారుల కోసం అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం టెక్స్ టైల్స్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ అరుణ్ వనదేవతలను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, ఎండోమెంట్ నిర్వహణ అధికారి రాజేందర్, ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వసంతరావు, డీపీఓ వెంకయ్య, ఐటీడీఏఎస్ఓ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర వేడుకలను జయప్రదం చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ** : అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గణతంత్ర దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26న ఉదయం పోలీస్ పేరేడ్ గ్రౌండ్స్ ఆవరణలో జరుగు గణతంత్ర దినోత్సవ వేడుకలలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం ఉంటుందన్నారు. పోలీసు శాఖ సమన్వయంతో బ్యారికేడింగ్, పార్కింగ్, వేదిక ఏర్పాటుతో పాటు లోపల, వెలుపలికి వెళ్లే దారిని లెవెలింగ్ చేయవలసిందిగా ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. వేదికను పలు రంగుల పూలతో అందంగా అలంకరించాలని ఉద్యాన శాఖ అధికారికి, విద్యుత్తులో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడవలసినదిగా విద్యుత్ శాఖాధికారిని ఆదేశించారు. పట్టణమంతా శుభ్రంగా ఉండేలా చూడాలని, మైదానంలో వాటరింగ్ చేయాలని సూచించారు. జిల్లా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ సందేశం రూపొందించవలసిందిగా డీపీఆర్ఓను ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులచే దేశభక్తిని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వాన పత్రికను ముద్రించి అతిథులను, స్వాతంత్ర్య సమరయోధులను ఆహ్వానించి సన్మాన కార్యక్రమాలు ఏర్పాటుచేయాలని, లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అంబులెన్స్ ను సిద్ధం ఉంచవలసిందిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని, అగ్నిమాపక వాహనాలు సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులను, యువతను సమీకరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్ జీ, ట్రైనీ కలెక్టర్ శ్రద్దా శుక్లా, డీఆర్ఓ వై.వీ గణేష్, డీఆర్డీఓ శ్రీనివాస్ కుమార్, డీపీఓ జగదీశ్వర్, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి** : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి పది సంవత్సరాలుగా గత ప్రభుత్వ హయాంలో పరిష్కరించబడని ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను సమావేశంలో చర్చించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సీనియర్ నాయకుడు కందుకూరి దేవదాసు డిమాండ్ చేశారు. 2024సంవత్సరానికి సంబంధించిన డీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ శుక్రవారం జడ్పీహెచ్ఎస్ గొర్లవీడు పాఠశాలలో డీటీఎఫ్ భూపాలపల్లి జిల్లా సీనియర్ నాయకుడు కందుకూరి దేవదాసు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఉపాధ్యాయుల సమావేశంలో డీటీఎఫ్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా సీనియర్ నాయకుడు కందుకూరి దేవదాసు మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలు అనే పేరుతో అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా వాటిని అమలు పరచకుండా తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చడమే కాక, ఉపాధ్యాయుల, విద్యారంగా సమస్యలను ఏమాత్రం పట్టించుకోకుండా విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని అన్నారు. ఈ సమావేశంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా సీనియర్ నాయకుడు ఏ.జయప్రకాష్, పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు, కె.వంశీ ,కె.వాసుదేవ్, ఎం.నవనీత్, జె.మాలతి, కే.శంకర్రావు, జి.సుధాకర్ రెడ్డి, రఘుపతి, సునీత, మమత, మేరీ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని కలిసిన వర్కింగ్ జర్నలిస్టులు




**వరంగల్ వాయిస్, తొర్రూరు** : డివిజన్ కేంద్రంలో శుక్రవారం పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డిని, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి అనుమాండ్ల ఝాన్సీ రెడ్డిలను కేంద్రంలోని స్థానిక వర్కింగ్ జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిచినందుకు అభినందనలు తెలిపి పూల బొకేలను అందించారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలకు సంబంధించిన వినతి పత్రాన్నిఅందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జి ఝాన్సీ రెడ్డిలు సంయుక్తంగా మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టే వివిధ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యవంతం చేయడంలో మీడియా పాత్ర ఎనలేనిదని కొనియాడారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్టులు కొమ్ము దేవేందర్, వెల్తూరి పూర్ణ రామచందర్, మహమ్మద్ అమీర్, పెందోట కిషన్ రావు, నల్లపు రాజు, ధారావతు రాజేందర్, బందు మహేందర్, మహంకాళి శ్రీనివాస్, రాయిశెట్టి ఉపేందర్, వెల్తూరి మల్లేశం, మడిపెద్ది కార్తీక్, శ్రీరంగం నవీన్, బురుగు శ్రీకాంత్ గౌడ్, పొన్నాజు యశ్వంత్, నాల్లం శ్రీనివాస్, పస్తం సాంబ పాల్గొన్నారు.

# డీన్‌గా బాధ్యతలు స్వీకరించిన గాదే సమ్మయ్య



**వరంగల్ వాయిస్, కేయూ :** డీన్ ఫ్యాకల్టీగా ఆచార్య గాదే సమ్మయ్య శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. నేటి నుంచి రెండు సంవత్సరాల కాలం పదవీలో కొనసాగనున్నారు. డీన్ గా రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ను పటిష్ట పరచడంలో ముఖ్యపాత్రను పోషిస్తారు. ఆచార్య సమ్మయ్య బీ.ఫార్మసీ, డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీని కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో పూర్తి చేశారు. మాస్టర్ ఆఫ్ ఫార్మసీని బనారస్ హిందూ యూనివర్సిటీ వారణాసిలో చదివారు. ఈయన పర్యవేక్షణలో 4డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేయడం జరిగింది. ముగ్గురు డాక్టరేట్ డిగ్రీ సమర్పించడానికి సిద్ధంగా ఉన్నారు. మరో నలుగురు ప్రస్తుతం వారి రీసెర్చ్ కొనసాగిస్తున్నారు. ఆచార్య సమ్మయ్య ఆధ్వర్యంలో 73ఆర్టికల్స్ నేషనల్, ఇంటర్నేషనల్ జర్నల్ లో ప్రచురించడం జరిగింది. ఆచార్య సమ్మయ్యకు డీఎస్ టీ, యూజీసీ నుంచి యాంటీ క్యాన్సర్, ఆంటీ హెచ్ఐవీ కోసం కొత్త మాలిక్యులు తయారు చేయడానికి నిధులు మంజూరయ్యాయి. ఆచార్య గాదె సమ్మయ్య ఆధ్వర్యంలో 65మంది మాస్టర్ ఆఫ్ ఫార్మసి కోర్సును పూర్తి చేశారు. మరో 23మంది ప్రస్తుతం పరిశోధనలు కొనసాగిస్తున్నారు. ఆచార్య సమ్మయ్య పరిశోధనలు ముఖ్యంగా యాంటీ బ్యాక్టీరియల్, ఆంటీ వైరల్, కోవిడ్-19, ఆంటీ డయాబెటిక్, యాంటీ క్యాన్సర్, ఆంటీ ఆక్సిడెంట్, అల్జిమర్, పార్కిన్సోనీ వంటి రోగాలపై మాలిక్యుల్ తయారు చేయడానికి ప్రస్తుతం విస్తృత రీసెర్చ్ నడుస్తోంది. గతంలో ఆయన ప్రిన్సిపాల్ అండ్ హెడ్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్ పర్సన్ గా హెల్త్ సెంటర్ మెంబర్ ఇంచార్జి గా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గా కీలకమైన పదవీ బాధ్యతలు చేపట్టారు. మెంబర్ ఇంచార్జి ఫర్ హెల్త్ సెంటర్ గా ఉన్నప్పుడు విద్యార్థులకు మెరుగైన వైద్య సదుపాయం అందించడానికి తన వంతు బలమైన కృషి చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్ గా ఉన్న కాలంలో అంబేద్కర్ విద్యా విధానాన్ని, బుద్ధుడి ప్రవచనాలను, నేషనల్ ఇంటర్నేషనల్ సెమినార్స్, వర్క్ షాప్స్, గెస్ట్ లెక్చర్స్ ఎన్నో నిర్వహించడం జరిగింది. కొత్తగా డీన్ గా పదవీ బాధ్యతలు ప్రొఫెసర్ నరసింహ రెడ్డి నుంచి చేపట్టిన ఆచార్య సమ్మయ్యను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రసాద్, ప్రొఫెసర్ కృష్ణవేణి బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్ పర్సన్, డాక్టర్ స్వరూప, డాక్టర్ సాహిద, డాక్టర్ నాగరాజు, ఆచార్య సుధీర్ కుమార్, ఆచార్య వెంకటేశ్వరరావు, చల్లా శ్రీనివాసరెడ్డి, ఆచార్య విజయకుమార్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ సునీత, డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ భాగ్య డాక్టర్ సుజాత డాక్టర్ ఉషాకిరణ్, వై.డాక్టర్ శశిధర్, రీసెర్చ్ స్కాలర్ అయినటువంటి శ్రీ రమ్య, స్వర్ణలత, మంజుల, సుష్మిత, మాస్టర్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థిని విద్యార్థులు, బీఫార్మసీ విద్యార్థిని విద్యార్థులు, నాన్ టీచింగ్ ఉద్యోగులు పుష్పగుచ్చం శాలువాలతో సత్కరించారు.

## ఎల్‌హెచ్‌పీఎస్ మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలిగా ధరంసోత్ స్వప్న



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలో శుక్రవారం లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్ హెచ్ పీఎస్) జిల్లా జనరల్ బాడీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీలో మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలిగా కంచర్లగూడెం గ్రామానికి చెందిన ప్రస్తుత ఉప సర్పంచ్ ధరంసోత్ స్వప్న బాలునాయక్ ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర కో కన్వీనర్ బీమా నాయక్ తెలిపారు. లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ బీమా నాయక్ మాట్లాడుతూ ధరం సోత్ స్వప్న గత పది సంవత్సరాలుగా ఎల్ హెచ్ పీఎస్ నిర్వహించే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని అందరికన్నా ముందుండి సంఘాన్ని నడిపించడంలో తనదైన పాత్ర పోషించి అందరి మన్ననలు పొందారన్నారు. కాబట్టి, ధరం సోత్ స్వప్నబాలు నాయక్ కు మహబూబాబాద్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం భవిష్యత్తులో రాజీలేని పోరాటాలు నిర్వహిస్తానని, తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ బాధ్యతలకు కట్టుబడి ఉంటానన్నారు. సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానని చెప్పారు. లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బెల్లయ్య నాయక్, గుగులోతు హరి నాయక్, రాష్ట్ర కో కన్వీనర్ గుగులోతు బీమా నాయక్ కు ధన్యవాదాలు తెలిపారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని స్వీకరిస్తున్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డేవిడ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీలోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ లపై రెవెన్యూ అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు కల్పించేందుకు ఫామ్-18 ద్వారా స్వీకరించడం జరుగుతుందని ఆన్ లైన్ ద్వారా గాని ఆఫ్ లైన్ ద్వారా గాని అందజేయ వచ్చునన్నారు. ప్రధానంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందెందుకు డిగ్రీ ఉత్తీర్ణత కావలసి ఉందని ఓటు హక్కు నమోదు తేదీకి మూడు సంవత్సరాలు పూర్తి చేసి ఉండాలన్నారు. రెవెన్యూ అధికారులు దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి స్వయంగా పరిశీలన చేయాలని ఆధార్ కార్డు లేకపోయినా ఫొటో తీసుకోవాలన్నారు. అలాగే ఎపిక్ కార్డు నెంబర్ కూడా దరఖాస్తులో నమోదు చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తుల అందించే తేదీ ఫిబ్రవరి ఆరో తేదీ చివరి గడువుగా తెలియజేశారు. ఈ సమావేశంలో మహబూబాబాద్, డోర్నకల్ ఆర్డీవోలు అలివేలు, నరసింహారావు, 18 మండలాల తాసిల్దార్లు, ఉప తాసిల్దార్లు పాల్గొన్నారు.

# నిజ నిర్ధారణ కమిటీ నివేదికకు కాలయాపన

### రెండేళ్లైనా బహిర్గతం చేయకపోవడానిక కారణమేంటీ?

### బీఎస్‌ఎఫ్ కేయూ అధ్యక్షుడు శివకుమార్



**వరంగల్ వాయిస్, కేయూ :** ఆర్ట్స్ కళాశాలలో జరిగిన అవినీతి అక్రమాలపై నిజ నిర్ధారణ కమిటీ నివేదిక కాలయాపనకు కారణం ఏమిటని, విచారణ కమిటీ వేసి రెండు సంవత్సరాలు గడుస్తున్నా నివేదిక ఎందుకు బహిర్గతం చేయడం లేదని, అవినీతి ఆరోపణలు ఎదుర్కుంటున్న వ్యక్తిని ప్రిన్సిపాల్ గా ఎలా కొనసాగిస్తారని బీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు శివకుమార్ ప్రశ్నించారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ లో ఏర్పాటు చేసిన బీఎస్ఎఫ్ కమిటీ సమావేశంలో యూనివర్సిటీ అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన అవినీతి అక్రమాలపై యూనివర్సిటీ వైస్ చాన్సలర్ విచారణ కమిటీ నియమించి రెండు సంవత్సరాలు గడుస్తుందని, ఇప్పటివరకు ఎలాంటి నివేదిక బయటకు రాకపోవడానికి గల కారణాలు ఏంటీ అని ప్రశ్నించారు. అదే విధంగా ఎస్టిమేషన్ కోర్సులలో 10సంవత్సరాలలో విద్యార్థిని విద్యార్థుల సంఖ్య ఎంత టీసీలు మంజూరు చేయుటలో ఏ ఆర్ కిష్టయ్య పాత్రపై, ప్రిన్సిపాల్ పాత్రపై పూర్తి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సెల్ఫ్ ఫైనాన్స్ ,రెగ్యులర్ డిగ్రీ, పీజీ కోర్సుల ఫీజుల శాతం బయటకు రావాలన్నారు. ఆర్ట్స్ కళాశాలలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, వెంటనే విచారణ కమిటీ నివేదిక బయట పెట్టి అవినీతి అక్రమాలకు పాల్పడ్డ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి నరసింహ,ఉపాధ్యక్షుడు అజిత్, వినోద్, రఘువరన్, శ్రీకాంత్ , విశాల్, భూపతి పాల్గొన్నారు.

## శ్యామ్ సుందర్ మరణం తీరని లోటు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 40వ డివిజన్ ఉర్సు బొడ్రాయి కమిటీ అధ్యక్షుడు, మున్సిపల్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్, ఆధ్యాత్మిక వేత్త ఆమంచ శ్యామ్ సుందర్ మరణం తీరని లోటని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. శుక్రవారం ఆమంచ శ్యాంసుందర్ భౌతిక దేహాన్ని ఆయన సందర్శించి పూలదండ వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమంచ శ్యాంసుందర్ దైవభక్తియే కాకుండా సమాజ సేవకులు అని ఆయన సేవలను ప్రజలు మర్చిపోరన్నారు.

## త్రీ ఫేస్ కరెంట్‌గా మార్చాలని ఏడీకి వినతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ పరిధిలోని 02వ డివిజన్ రెడ్డిపురంలోని సాయి కృపా కాలనీకి సంబందించిన 2ఫేస్ కరెంట్ ను 3 ఫేస్ కరెంట్ గా మార్చాలని శుక్రవారం కాలనీ వాసులు చింతగట్టు క్యాంపు ఏడీ కార్యాలయంలో ఏడీ గంగా రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు రాజమల్లు, రాజు, ఐలయ్య, రఘుపతి,దశరథం, రాంబాబు, మొగిలి, రమేష్, కిరణ్‌పాల్గొన్నారు.

## సత్యరెడ్డిని కలిసిన నరేంద్ర కుమార్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి అల్లుడు సత్యరెడ్డిని శుక్రవారం వరంగల్ లోని నూతన హెూండా షోరూంకు విచ్చేసిన సందర్భంగా మర్యాదగా పూర్వకంగా 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ కలిశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తోట బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట రైల్వే జంక్షన్ లో ప్లాట్ ఫామ్ నెంబర్ 1పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని కాజీపేట జీఆర్పీ పోలీసులు తెలిపారు. అతని వయసు 55 ఏళ్లు కలిగి ఉన్నాడన్నారు. ఆ వ్యక్తి వద్ద 81463991 నంబర్ గల బాసర నుంచి రాజమండ్రి వరకు వెళ్లు రైలు జనరల్ టికెట్ ఉందని తెలిపారు. దాని ఆధారంగా (భిలసపుర్) ట్రైన్ నెంబర్ 12788లో మరణించినట్లు గుర్తించామన్నారు. అతడి వద్ద టికెట్ తప్ప ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. ఈ వ్యక్తి వివరాలు తెలిసిన వారు కాజీపేట జీఆర్పీలో సమాచారం అందించాలన్నారు. ఈ వ్యక్తి మృతదేహం ఎంజీఎం మార్చురీలో భద్రపరిచామన్నారు. మరింత సమాచారం కోసం 986616729, 9440604320గల నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కాజీపేట జీఆర్పీ పోలీసులు తెలిపారు.

# ఈగల్ సినిమాకు మళ్లీ పోటీ ..



సంక్రాంతి పండగకి ఐదు సినిమాలు పోటీలో ఉంటే అందులో రవితేజ నటించిన 'ఈగల్' సినిమాని వాయిదా వేయించారు. ఆ సమయంలోనే ఆ సినిమా నిర్మాతలు అయిన పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ ప్రతినిధులకు ఆ సినిమా ఎప్పుడు విడుదలైన సోలోగా విడుదల చేసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తామని ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ హామీ ఇచ్చింది. 'ఈగల్' సంక్రాంతి పోటీ నుండి తప్పుకొని ఫిబ్రవరి 9వ తేదీన విడుదల చేస్తున్నట్టుగా ప్రకటన వచ్చింది. అయితే అదేరోజు చాలా సినిమాలు విడుదలకి వున్నాయి. అందులో రజినీకాంత్ నటించిన 'లాల్ సలామ్', సందీప్ కిషన్ 'ఊరు పేరు భైరవకోన', మహి వి రాఘవ రాజకీయ చిత్రం 'యాత్ర 2' ఫిబ్రవరి 8న విడుదలవుతున్నాయి. నిన్న 'ఊరు పేరు భైరవకోన' ట్రైలర్ విడుదల సందర్భంగా సందీప్ కిషన్ తాను రవితేజ సినిమాకి పోటీగా వస్తున్నాను అని ప్రకటించారు. ఈగల్' సినిమా నిర్మించిన పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కి ఒక లెటర్ పంపింది. 'మీరు అప్పుడు మా సినిమాకి సోలోగా విడుదల చేసుకోవటానికి వీలు కల్పిస్తామని మాట ఇచ్చారు, కానీ ఇప్పుడు చాలా సినిమాలు విడుదలవుతున్నట్టుగా వున్నాయి, మరి మీరు ఇచ్చిన హామీని నిలబెట్టుకోండి,' అని ఛాంబర్ ని అడుగుతూ లెటర్ పంపారు. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో కావ్య తాపర్, అనుపమ పరమేశ్వరన్, నవదీప్, వినయ్ రాయ్, మధుబాల కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, సాంగ్స్ ఆకట్టుకున్నాయి. ఇందులో మరోసారి రవితేజ డిఫరెంట్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 9న రిలీజ్ చేయాలనుకున్నారు.

కానీ ఇప్పుడు ఈగల్ సినిమాకు మళ్లీ పోటీ ఏర్పడింది. అదే రోజున రిలీజ్ అయ్యేందుకు చాలా సినిమాలు క్యూ కడుతున్నాయి. ఫిబ్రవరి 8న యాత్ర 2, ఫిబ్రవరి 9న ఊరు పేరు భైరవకోన, రజినీకాంత్ లాల్ సలామ్ డబ్బింగ్ చిత్రాలు విడుదలయ్యేందుకు సిద్ధమయ్యాయి. దీంతో తమకు సోలో రిలీజ్ డేట్ కావాలంటూ సదరు నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తెలుగు ఫిలం ఛాంబర్‌కు లేఖ రాసింది.

# సింగిల్ షాట్‌లో.. 105 మినిట్స్

హన్సిక హీరోయిన్‌గా రాజు దుస్సా దర్శకత్వంలో బొమ్మక్ శివ నిర్మాతగా వస్తున్న సినిమా '105 మినిట్స్'. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి విడులైన మోషన్ పోస్టర్, థీమ్ సాంగ్ మంచి స్పందనను రాబట్టుకోగా.. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమాలో చేసిన పాత్ర గెటప్‌లోనే హన్సిక స్టేజ్ పైకి వచ్చి ఈ ట్రైలర్‌ని విడుదల చేయడం విశేషం. ఒకే పాత్రతో ఒకే షాట్లో చిత్రీకరించబడిన మొట్టమొదటి ప్రయోగాత్మక చిత్రంగా '105 మినిట్స్' సినిమా తెరకెక్కింది. జనవరి 26న సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ట్రైలర్ విడుదల సందర్భంగా హీరోయిన్ హన్సిక మాట్లాడుతూ.. 105 మినిట్స్ సినిమా రిలీజ్ అవుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఇది పూర్తిగా ప్రయోగాత్మక చిత్రం. 34 నిమిషాల షాట్‌ని సింగిల్ టేక్‌లో చేయడం అనేది నాకు ఒక కొత్త అనుభవంలా అనిపించింది. 8 రోజులు రిహార్సల్స్ చేసిన షార్ట్ అది. ఇలాంటి ప్రయోగాలు సినిమాలో ఎన్నో ఉన్నాయి. ఈ మూవీకి నన్ను సెలెక్ట్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. జనవరి 26న రిలీజ్ అవుతున్న మా సినిమాను ప్రేక్షకులు చూసి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నానని అన్నారు. కో ప్రొడ్యూసర్ సుమన్ మాట్లాడుతూ.. నిజంగా నిర్మాత బొమ్మక్ శివ గారికి ఎంతో గట్స్ ఉంటే గాని ఇలాంటి కంటెంట్ యాక్సెప్ట్ చేయడం కష్టం. ఇది ఒక మంచి కంటెంట్ ఉన్న థియేటర్ సినిమా. ప్రస్తుతం ఈ సినిమాని తెలుగులోనే వరల్డ్ వైడ్ రిలీజ్ చేసి తర్వాత డిఫరెంట్ లాంగ్వేజస్‌లో పాన్ ఇండియా లెవెల్‌లో తీసుకొస్తామని అన్నారు. దర్శకుడు రాజు దుస్సా మాట్లాడుతూ.. మొట్టమొదటిసారిగా దర్శకత్వం వహిస్తున్న నన్ను నమ్మి, కంటెంట్‌ని నమ్మి ఈ సినిమాని నిర్మించడానికి ముందుకు వచ్చిన నిర్మాత బొమ్మక్ శివ గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



# క్షమాపణలు చెప్పిన నటి నయనతార

లేడీ సూపర్ స్టార్ నయనతార నటించిన 'అన్నపూరణి' సినిమాపై కొద్దిరోజులుగా వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. డైరెక్టర్ నీలేష్ కృష్ణ దర్శకత్వం వహించిన ఈ మూవీపై రాముడిని కించపరిచే విధంగా కొన్ని డైలాగ్స్ ఉన్నాయంటూ.. అలాగే లవ్ జిహాద్ ప్రోత్సహించేలా సినిమా ఉందంటూ దేశవ్యాప్తంగా తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ చిత్రం హిందూవుల మనోభావాలను దెబ్బతీసిందని.. తక్షణమే ఈ చిత్రాన్ని ఓటీటీ నుంచి తొలగించి చిత్రయూనిట్ పై చర్యలు తీసుకోవాలంటూ శివసేన మాజీ నేత రమేష్ సోలంకి పోలీసులకు ఫిర్యాదు చేసారు. దీంతో ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫాం నెట్ ప్లిక్స్ అన్నపూరణి చిత్రాన్ని తొలగించింది. ఈ వివాదం పై నటి నయనతార సపందిస్తూ... ఇన్ స్టాలో జై శ్రీరామ్ అంటూ నోట్ షేర్ చేసింది. జై శ్రీరాం.. గత కొన్ని రోజులుగా నా సినిమా అన్నపూరణి చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై బరువెక్కిన హృదయంతో ఈ ప్రకటన చేస్తున్నాను. దేవుడిపై ఎంతో నమ్మకంతో అన్ని ప్రార్థనా స్థలాలను సందర్శించే నేను ఉద్దేశపూర్వకంగా ఇలా చేసి ఉండను. అంతకు మించి మీ మనోభావాలను ఏ విధంగానైనా గాయపరిచి ఉంటే క్షమించండి. అంటూ పోస్ట్ చేశారు.



# ఓటిటిలోకి వచ్చేసిన సలార్




## నెట్‌ఫ్లిక్స్‌లో నేటినుంచి స్ట్రీమింగ్

చాలా కాలం తర్వాత ప్రభాస్ ఖాతాలో మాస్ బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న సినిమా సలార్. ఎన్నో అంచనాల మధ్య గతేడాది డిసెంబర్ 22న విడుదలైన ఈ మూవీ ఊహించని స్థాయిలో సెన్సెషన్ సృష్టించింది. బాహుబలి తర్వాత ఆ రేంజ్ హిట్ అందించిన మూవీ ఇదే కావడం విశేషం. ఈ సినిమా పాన్ ఇండియా బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.700 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఈ చిత్రాన్ని రెండు పార్టులుగా తీసుకువస్తున్నారు మేకర్స్. ఫస్ట్ పార్ట్ విజయంతో.. ఇప్పుడు సెకండ్ పార్ట్ పై మరింత హైప్ పెరిగింది. ఇదిలా ఉంటే.. ఇప్పటివరకు థియేటర్లలో సంచలనం సృష్టించిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేస్తోంది. విడుదలైన నెల రోజుల్లోనే డిజిటల్ ప్లాట్ ఫాంలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫాం నెట్ ప్లిక్స్ లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుందని గతంలోనే అనౌన్స్ చేశారు మేకర్స్. కానీ రిలీజ్ డేట్ మాత్రం అనౌన్స్ చేయలేదు. ఇక ఇప్పుడు స్ట్రీమింగ్ డేట్ ప్రకటించి ప్రేక్షకులకు సర్ ప్రైజ్ చేసింది నెట్ ప్లిక్స్. ఈ సినిమా జనవరి 20 నుంచే స్ట్రీమింగ్ కాబోతుందని తెలిపారు. అంటే మరికొన్ని గంటల్లో ఓటీటీలోకి రాబోతుంది. ఇప్పుడు అభిమానులు, ప్రేక్షకులు ఆనందపడుతున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. ఇక ఆ తర్వాత హిందీలో ఈ మూవీ రిలీజ్ అవుతుందని తెలుస్తోంది.

# బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా గంటా రవి

**ప్రకటించిన రాష్ట్ర కమిటీ**

**పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మార్పులు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు గంట రవికుమార్ ను నియమిస్తూ రాష్ట్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం రాత్రి తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు అధ్యక్షులను, రాష్ట్ర కమిటీ వివిధ మోర్చాలకు అధ్యక్షులను ప్రకటించింది. త్వరలో జరుగనున్న లోక్ సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ నియామకాలను చేసినట్లు తెలిసింది. రాష్ట్రంలో కనీసం 12 స్థానాల్లో బీజేపీ విజయం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు రాష్ట్ర కమిటీ సూచిస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గంనుంచి బీజేపీ అభ్యర్థి గెలిచేందుకు అవకాశాలు ఉన్నప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోవడంలో గత అధ్యక్షుడు విఫలమయ్యాడనే విమర్శలున్నాయి. దీంతో పార్టీ అధ్యక్ష పదవి మార్పు అనివార్యంగా మారింది. ఈ నేపథ్యంలో విద్యాధికుడు, పార్టీకోసం కష్టపడి చేసే సీనియర్ నేత గంటా రవికుమార్ కు జిల్లా అధ్యక్ష పదవిని కట్టబెట్టారు. ఆజంజాహి మిల్లు కార్మికుడి కుమారుడైన గంటా రవికుమార్ ఎంసీఏ, ఎల్ ఎల్ బీ పూర్తి చేశారు. సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ పేరుతో కంప్యూటర్ సంస్థను ఏర్పాటు చేసి ఎందరికో కంప్యూటర్ పరిజ్ఞానాన్ని చేరువ చేశారు. ఇక్కడ శిక్షణ పొందిన వేలాది మంది దేశ, విదేశాల్లో ఉన్నత స్థానంలో స్థిరపడ్డారు.



**మరింత ఉత్సాహంతో పని చేస్తా..**

ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరచడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని ప్రకటించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నాయకత్వంలో, తెలంగాణలోను అధికారం దిశగా కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి నాయకత్వంలో మరింత ఉత్సాహంతో పని చేస్తానన్నారు. వరంగల్ జిల్లాలో పార్టీని బడుగు బలహీన వర్గాలకు చేరువ చేయడంతోపాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. జాతీయ వాద సిద్ధాంతం కలిగిన యువతకు ప్రాధాన్యం ఇస్తూ, సేవ గుణం ఉన్న యువతను రాజకీయాలలోకి వచ్చేలా కృషి చేస్తానన్నారు. జిల్లాలోని సంఘ పరివార్ పెద్దల సూచనలతో పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ పేద బడుగు బలహీన వర్గాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, దేశంలో చేస్తున్న అభివృద్ధి, ప్రపంచంలో భారత దేశాన్ని అగ్రగామిగా నడిపించడంలో చేస్తున్న కృషిని, ప్రతి కుటుంబానికి చేర్చేందుకు పాటుపడుతానన్నారు. నాకు అప్పగించిన బాధ్యతను శక్తివంచన లేకుండా పని చేస్తాన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీజేపీ సీనియర్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ జిల్లా అధ్యక్షుల మార్గదర్శనంలో ముందుకు సాగుతానన్నారు. బీజేపీలోని ప్రతీ కార్యకర్తను కలుపుకొని పోతానని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపు లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు. తన నియమకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా కరీంనగర్ ఎంపీ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఎంపీ టికెట్ కేటాయించండి

## ఏఐసీసీ సెక్రటరీని కలిసిన డాక్టర్ రామకృష్ణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ ఎంపీ టికెట్ తనకు కేటాయించాలని ఏఐసీసీ సెక్రటరీ, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ ను డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ కోరారు. శుక్రవారం హైదరాబాద్ లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన రామకృష్ణ వచ్చే ఎన్నికల్లో తనకు ఎంపీ టికెట్ కేటాయించాలని అభ్యర్థించారు. తెలంగాణ ఉద్యమకారుడిగా, ప్రజాసేవకుడిగా, కాంగ్రెస్ పార్టీ విధేయుడిగా జిల్లాలో, రాష్ట్రంలో, దేశంలో కూడా మంచి పేరున్న తనకు టికెట్ కేటాయిస్తే తప్పకుండా విజయం సాధిస్థానన్న ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సంఘాలు కూడా సహకరించి కాంగ్రెస్ పార్టీ గెలుపులో తోడుంటాయని రామకృష్ణ బృందం ఏఐసీసీ సెక్రటరీకి తెలిపారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన ఏఐసీసీ సెక్రెటరీకి డాక్టర్ రామకృష్ణ, ప్రజా సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.








# ఆయిల్ ట్యాంకర్ బస్సు ఢీ

## 25 మందికి గాయాలు

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ఆత్మకూరు మండలం నీరుకుల్లా క్రాస్ రోడ్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ములుగు నుంచి హనుమకొండ వైపు వస్తున్న బస్సును ఎదురుగా వచ్చిన ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో పెను ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం దెబ్బతినగా ట్యాంకర్ బోల్తా పడింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 25 మందికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వీరందరినీ 108 లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. క్షతగాత్రుల వివరాలను తెలుసుకొని సమాచారం అందించనున్నట్లు వెల్లడించారు.

# మన సంస్కృతిని కాపాడుకుందాం

## మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుందామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం హైదరాబాద్ లో ఆధ్యకళ మ్యూజియం ఆధ్వర్యంలో జానపద, గిరిజన కళలు-సంస్కృతి-అధ్యయనం పరిరక్షణ అంశంపై నిర్వహించిన సద్దస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మన పూర్వీకులు ఉపయోగించిన వస్తువులను మన భవిష్యత్తు తరాలకు చూపించాలన్న లక్ష్యంతో మ్యూజియం ఏర్పాటు చేసిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరాం, తదితరులు పాల్గొన్నారు.






EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com